క్లుప్తంగా

నేడు మండల సమావేశం

పుల్లంపేట : పుల్లంపేట ఎంపీడీఓ సభా భవనంలో నేడు (శుక్రవారం) ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

బాలుడికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న సేవాసంస్థల సభ్యులు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలి సత్తెమ్మ వీధిలో ఇటీవల కుక్కలదాడికి గురైన బాలుడు వెంకట రేవంత్(8)కి స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థలు గురువారం రూ. 73 వేలు అందించారు. మానవత సేవాసంస్థ రూ.33 వేలు, సీహెచ్‌ఎస్ సేవాసంస్థ రూ.40 వేలు కలిపి మొత్తం రూ. 73 వేలు బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత బాధ్యులు మునిరావు, సాయిరాం, ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, అవినాష్, తేజ, పవన్, రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

చిన్నమండెం : మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీ సద్దలగుట్టపల్లి వద్ద జరుగుతున్న చెరువులో ఉపాధి పనులను ఉపాధి హామీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి వారి బిల్లులు, మస్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు పనిదినాలు, పని కల్పించడంపై పలు సూచనలు చేశారు. పనులను నాణ్యతగా చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మాధవి, ఈసీ సూర్యప్రకాష్‌రెడ్డి, టీఏ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి

వీరబల్లి : వీరబల్లి పంచాయతీలోని నాయనవారిపల్లి గ్రామంలో అమరేంద్రనాయుడు కుమారుడు వివాహ వేడుకలో గురువారం అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ద్వారా మండలంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు వీరనాగిరెడ్డి, ఆరంరెడ్డి మదన్‌మోహన్ నాయుడు, చక్రీ నాయుడు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గురు నిలయం ప్రారంభం



గురు నిలయాన్ని ప్రారంభిస్తున్న కడప కథోలిక్ మేత్రాసన పీఠాధిపతి గాలి బాలి

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని రాయచోటి – వేంపల్లి జాతీయ రహదారిలో వెలసినటువంటి సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి ఆవరణంలో నూతన గురు నిలయాన్ని గురువారం కడప కథోలిక మేత్రాసన పీఠాధిపతి (బిషప్) రెవరెండ్ డాక్టర్ గాలిబాలి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ విజయమోహన్ రెడ్డి మాట్లాడుతూ కథోలిక గురువుగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నూతన గురు నిలయాన్ని ప్రారంభించినట్లు వారు తెలిపారు. లక్కిరెడ్డిపల్లి విచారణ గత 20 సంవత్సరలుగా దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా మెండుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలియజేశారు. అనంతరం బిషప్ గాలిబాలి ఆధ్వర్యంలో దివ్యబలిపూజను ఘనంగా సమర్పించారు. అనంతరం చర్చి ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కడప మేత్రాసన గురువులు, సంఘం పెద్దలు, విశ్వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్టు

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ కొత్తకుంట హరిజనవాడకు ఉత్తరాన కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్దనుంచి రూ.3260 లు నగదును, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మా గోడు వినండి మహాప్రభో!

కొన్ని సంవత్సరాలుగా సోమశిల జలాశయంలో ప్రతి ఏటా 74 టీఎంసీలు కంటే ఎక్కువ నీటిని నిల్వ చేస్తున్నందున సోమశిల జలాలు ఒంటిమిట్ట మండలంలోని తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు తదితర గ్రామాలకు వచ్చి చేరుతున్నాయి. దీంతో ఆయా గ్రామస్తులు కొన్ని రోజులపాటు జీవనాధారం కోల్పోయి, విష సర్పాల మధ్య గడుపుతూ బిక్కుబిక్కు మంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవించాల్సి వస్తోంది. తమ పరిస్థితి ఎప్పుడు మారుతుందో తెలియని పరిస్థితుల్లో ప్రజలు ఉంటున్నారు.



సోమశిల ఉన్నతాధికారులను వేడుకుంటున్న తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామస్తులు



నీట మునిగిన తప్పెటవారిపల్లె గ్రామం (ఫైల్)

- సోమశిల జలాలు ఇళ్ల వద్దకు చేరుతున్నాయంటూ ప్రజల ఆవేదన
- గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించాలంటూ విన్నపం
- జీఓ 68 ప్రకారం తమకు నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్

ఒంటిమిట్ట : కొన్ని దశాబ్దాల క్రితం సోమశిల జలాశయ నిర్మాణంలో వెనుకజలాలకు సంబంధించి తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు, ఇబ్రహీంపేట, గంగపేరూరు, చిన్నకొత్తపల్లి గ్రామ పొలాలను ముంపు ప్రాంతాలుగా నిర్ణయించి ఆ పంట పొలాలకు సంబంధించిన రైతులకు నష్టపరిహారం చెల్లించారు. ఇది ఇలా ఉండగా కొన్ని సంవత్సరాలుగా సోమశిల జలాశయంలో 74 టీఎంసీల కంటే నీటి సామర్థ్యం ఎక్కువ నిల్వ చేస్తుండటంతో ఇదివరకు తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాలకు సోమశిల వెనుక జలాల అంచనా కోసం ఏర్పాటు చేసిన సరిహద్దులను దాటుకుంటూ ఆయా గ్రామాల్లోకి వెనుకజలాలు వచ్చి చేరుతున్నాయి. దీనిపై పలుమార్లు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా వారికి ఎలాంటి పరిష్కారం చూపలేదు. గత ప్రభుత్వంలో మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాల్లోని సోమశిల వెనుకజలాలు రాకుండా రక్షణ గోడ నిర్మించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దానికి సంబంధించి అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇక్కడి గ్రామ ప్రజలు రక్షణ గోడ తమకు అవసరం లేదని, దానివల్ల గ్రామానికి నష్టమే తప్పా లాభం ఏమి లేదంటూ వాపోతున్నారు. ఎందుకంటే రక్షణ గోడ కలిపించడం వల్ల చుట్టుపక్కల ఉన్న వాగులు, వంకలు, వర్షపునీరు అన్ని తమ గ్రామంలోకి వచ్చి చేరుతాయని, అవి వెళ్లేందుకు మార్గాలన్నీ మూసుకుపోతాయని వారు వివరించారు. అయినా జీఓ 68 ప్రకారం ఏదైనా ముంపు ప్రాంతంలో సరిహద్దు రాయికి 100 మీటర్ల దూరంలో ఎలాంటి గృహాలు ఉన్న వాటిని ముంపు ప్రాంతంగా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. జీఓ ప్రకారం తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాలు అన్ని అర్హతలు కలిగి ఉన్నాయని, జీఓ ప్రకారం అయితే 70 శాతం ముంపునకు గురైన గ్రామం మొత్తాన్ని ముంపు గ్రామంగా తీసుకునే వెసులబాటు ఈ జీఓలో ఉంది. వీటిని పట్టించుకోకుండా అధికారులు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని ముంపు గ్రామస్తులు వాపోతున్నారు.

అధికారులకు గోడును తెలియజేసినా..

సోమశిల వెనుక జలాలకు సంబంధించి సరిహద్దు ప్రాంతాలను పరిశీలించే క్రమంలో మండల పరిధిలోని తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాల్లో సోమశిల జలాశయ ఉన్నతాధికారులు మంగళవారం పర్యటించారు. ఇందులో భాగంగా తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాలోని సోమశిల వెనుక జలాల సరిహద్దులను పరిశీలించారు. అనంతరం వారు గ్రామాల్లో పర్యటిస్తుండగా ముంపు బాధిత రైతులు, గ్రామస్తులు అధికారులకు తమ గోడును తెలియజేశారు. దశాబ్దాల క్రితం తమ భూములను సోమశిల వెనుకజలాల కోసం అరాకొర నష్టపరిహారం ఇచ్చి బంగారం పండించే మా పంటలను తీసుకున్నారని, అప్పటి నుండి బతుకుదెరువును కోల్పోయి కూలీ పనులకు పోవాల్సిన దౌర్భాగ్యం పట్టిందన్నారు. భూములతోపాటు మా ఇళ్లకు కూడా నష్టపరిహారం అందిస్తామని అప్పట్లో చెప్పినా, ఆ ఊసే బయటకు రాకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గ్రామాలను ముంపు గ్రామాలుగా గుర్తించి ఇళ్లకు నష్టపరిహారం అందజేసి, ఇంటికో ఉద్యోగాన్ని కల్పించాలని గ్రామస్తులు అధికారులను వేడుకున్నారు.

ముంపు ప్రాంతంగా గుర్తించండి



సోమశిల వెనుక జలాల వల్ల నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్న పెన్నపేరూరు గ్రామాన్ని ముంపు ప్రాంతంగా గుర్తించండి. సోమశిల వెనుక జలాలు తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాల్లోని గృహాల మధ్యకు వచ్చి చేరుతున్నాయి. దీంతో పంట పొలాల్లో నుండి గ్రామంలోని గృహాల్లోకి నీరు వచ్చి చేరడంతో నీటితోపాటు విష సర్పాలు వస్తుండడంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని జీవిస్తున్నాం. తమను ఇక్కడి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించి, ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలను అందించాలి.

– ముమ్మడి నారాయణరెడ్డి, ఎంపీటీసీ, పెన్నపేరూరు

జీఓ ప్రకారం ముంపు అర్హత ఉంది



వెనుకజలాల కారణంగా ఉపాధి లేకుండా పోయింది. ఇళ్ల వద్దకు నీరు చేరుతుండటంతో బయటకు రాలేని పరిస్థితి ఎప్పుడు తమ ఇళ్లు మునుగుతాయా తెలియడం లేదు. జీఓ 68 ప్రకారం తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాలకు ముంపు ప్రాంత గ్రామాలుగా అర్హత ఉంది. మరోసారి జీఓ 68ని పరిశీలించి తమ గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించి, తమ గృహాలకు నష్ట పరిహారంతోపాటు ఇంటికోక ఉద్యోగం కల్పించాలి.

– గజ్జల నరసింహారెడ్డి, తప్పెటవారిపల్లి

ప్రతి రైతు బీమా చేయించుకోవాలి

- ప్రీమియంను రైతులే చెల్లించాలి
- జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్



అధికారులకు సూచనలు చేస్తున్న చంద్రనాయక్

రాయచోటి టౌన్ : పంట సాగు చేసిన రైతులు అందరూ తప్పకుండా పంట బీమా చేసుకోవాలని, ఆ విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. గురువారం రాయచోటిలోని మార్కెట్ యార్డులోని వ్యవసాయశాఖ వారి కార్యాలయంలో రాయచోటి, చిన్నమండెం, సుండుపల్లె, సంబేపల్లె మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, సహాయక అధికారులకు డివిజన్ స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 – 25 రబీ సీజన్‌లో పంట సాగు చేసిన రైతులు ప్రతి ఒక్కరూ తప్పకుండా పంట బీమా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. వరి పంట సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.126లు, వేరుశనగ పంటకు ఎకరానికి రూ.96లు ప్రీమియం చెల్లించాలని సూచించారు. వేరుశనగకు డిసెంబర్ 15వ తేదీ, వరికి డిసెంబర్ 31వ తేదీలోపు ప్రీమియంలు రైతులు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అలానే టమాటా పంటకు ఎకరానికి రూ.1600లు డిసెంబర్ 15వ తేదీలోగా చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏలు మజీద్ అహ్మద్, శ్రీలత, ఏఓలు రమేష్ రాజు, వెంకటమోహన్, రామకృష్ణరాజు, దివాకర్, గీత, సరిత, రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఊపిరి ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీలోనే



మాట్లాడుతున్న గోవిందు బాలకృష్ణ

రాజంపేట టౌన్ : ప్రత్యర్థి పార్టీ వాళ్లు బీజేపీ సభ్యత్వ కార్డులో తన ఫొటో పెట్టి తాను బీజేపీ సభ్యత్వం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతుండటం తగదని వైఎస్సార్‌సీపీ పట్టణ బూత్ కన్వీనర్ల మేనేజర్ గోవిందు బాలకృష్ణ హెచ్చరించారు.

స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా సరదాగా తీసుకున్న ఓ ఫొటోతో బీజేపీ సభ్యత్వ కార్డును సృష్టించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. తొలి నుంచి తాను వైఎస్ కుటుంబానికి అభిమానిని అని, వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. పార్టీకి తాము చేసిన సేవలను గుర్తించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ అధిష్టానం తన భార్య గోవిందు రాజేశ్వరికి దాసరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవి ఇచ్చినట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తాను ఎప్పటికీ వైఎస్ జగన్‌కు వీరాభిమానిగా, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డిల అనుచరుడిగా కొనసాగుతానన్నారు. ఊపిరి ఉన్నంత వరకు తాను, తన కుటుంబం వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతుందని తెలియజేశారు.

శ్మశానానికి దారి కేటాయించండి



తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎస్.రాజంపేట దళితులు

సిద్దవటం : మండలంలోని ఎస్. రాజంపేట గ్రామం ఎస్సీలు శ్మశానానికి వెళ్లేందుకు దారి సమస్యను పరిష్కరించాలని గురువారం సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతకు వినతి పత్రాన్ని సమర్పించారు. వినతిపత్రం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం ఎస్. రాజంపేట ఎస్సీ కాలనీ వాసులకు పక్కనే ఉన్న పెన్నానదిలో శవాలను పాతిపెట్టేవాళ్లం. శ్మశానానికి వెళ్లడానికి సుమారు 30 సంవత్సరాల కిందట అప్పటి ఉమ్మడి కడప జిల్లా కలెక్టర్ తమకు శ్మశానవాటికకు వెళ్లడానికి దారి కాకర్ల చెన్నారెడ్డి పొలంలో నుంచి దారి మంజూరు చేశారు. వారికి భూమి నష్టం జరిగింది. కాబట్టి ప్రభుత్వ భూమి 40 సెంట్ల భూమిని ఇవ్వడం జరిగింది. అయితే వారి కుమారుడు కాకర్ల ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి ఈశ్మశాన వాటికకు వెళ్లే దారి మాది, ఈ దారిలో వెళితే మర్యాదగా ఉండదు ఎవరిని అడిగి పోతున్నారు. అని బూతులు తిడుతున్నారన్నారు. తమ గ్రామంలో ఎవరైనా చనిపోతే శవాన్ని ఎక్కడ పాతిపెట్టాలో తెలియడం లేదన్నారు. ఎస్సీలుగా ఉన్న మా మీద కుల వివక్ష చూపుతున్న కాకర్ల ప్రతాప్‌రెడ్డి అనే వారి మీద చర్యలు తీసుకొని, శ్మశానికి వెళ్లే మార్గానికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



పంటను పరిశీలిస్తున్న శ్రావణీ రెడ్డి

పుల్లంపేట : ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ఏపీటీఎస్‌ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రావణీరెడ్డి అన్నారు. గురువారం అనంతయ్యగారిపల్లిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేస్తున్న సుధామాధురి వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణీ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వలన తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. మల్చింగ్ వేయడం ద్వారా నిరంతరం భూమిలో తేమ ఏర్పడి పంట దిగుబడిని పెంచేందుకు వీలవుతుందన్నారు. ఘన జీవామృతం వాడడం వలన పంటలతోపాటు భూమికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. పురుగు మందులు అధికంగా వినియోగించడం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్వతి, లక్ష్మీలత, చంద్రకళ, ప్రమీళ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాకు యత్నం

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలోని ఉప్పరపల్లెలో సర్వేనెంబర్ 937/ఏలో హైవేకు అనుకుని ఉన్న 40 సెంట్ల పోరంబోకు రస్తా స్థలాన్ని కొంతమంది వ్యక్తులు తవ్వకాలు జరుపుతుండగా గురువారం స్థానికులు అడ్డుకోవడంతో పనులను నిలుపుదల చేశారు. ఈ విషయమై సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా సర్వేనెంబర్ 937లో ఎటువంటి పనులు చేయకూడదని ఆస్థలం వివాదంలో ఉందని ఎవరూ పనులు చేయకూడదని హెచ్చరించారు.

క్యాన్సర్‌ను ధైర్యంగా జయించండి



ఓబులవారిపల్లె: అవగాహన ర్యాలీలో వైద్యాధికారులు, సిబ్బంది



రాయచోటి అర్బన్: యండపల్లె పీహెచ్‌సీ వద్ద క్యాన్సర్ అవగాహన ర్యాలీ

ఓబులవారిపల్లె : క్యాన్సర్ మహమ్మారిని ధైర్యంగా ఎదుర్కొని జీవించాలని వైద్యాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం ముక్కవారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమని, 18 సంవత్సరాలు నిండిన వారికి వారి ఇంటివద్దనే క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రధానంగా నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి రూప, హెల్త్ అసిస్టెంట్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు పరీక్ష – క్యాన్సర్ నుండి శ్రీరామరక్ష

రాయచోటి అర్బన్ : ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్సలు చేయించుకోవడమే శ్రీరామరక్ష అని యండపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిణి జ్యోతి అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాయచోటి రూరల్ మండలం యండపల్లెలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు జ్యోతి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి వారి ఇళ్ల వద్దనే క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టును ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా మహిళలకు సంక్రమించే రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుడు ఖదీర్‌బాషా, ఫార్మసీ అధికారి గంగాధర్, విశ్వనాథరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రాజేంద్ర, సీనియర్ అసిస్టెంట్ సుజిత్ డాల్, స్టాఫ్ నర్సులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబానికి భరోసా



చంద్రశేఖర్ కుటుంబానికి భరోసా కల్పిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని బొజ్జవారిపల్లి పంచాయతీ హరిజనవాడకు చెందిన జి.సుధాకర్ సోదరుడు చంద్రశేఖర్ ఆకస్మికంగా మృతి చెందడంతో గురువారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడరాదని, బడుగు, బలహీన వర్గాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు పెరటితోటలు వేయాలి



కాషాయాల తయారీని వివరిస్తున్న మధుకర్

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీలో సుధాకర్ వ్యవసాయ క్షేత్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం ప్రకృతి వ్యవసాయం రామాపురం మాస్టర్ ట్రైనర్ మధుకర్ శిక్షణను అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం గురించి, వాటితో కలిగే లాభాలను వివరించారు. అనంతరం కాషాయాల తయారిపై శిక్షణ ఇచ్చారు. పెరటితోటలతో లాభాలు, పిల్లల పోషక విలువలు, గర్భిణీలు, స్త్రీలకు పోషక విలువల గురించి చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రంలో 100 అడుగులు విస్తీర్ణంలో పెరటి తోటలు వేసుకోవాలని సీడీపీఓ పద్మావతి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పెరటితోటల వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మజ, సుజాత, హుసేనమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సుధాకర్, యూనిట్ ఇన్‌చార్జ్ ఉత్తమ మహిళా రైతు శ్రీదేవి, రాజగోపాల్ పాల్గొన్నారు.

విధులకు సచివాలయ సిబ్బంది డుమ్మా!

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయం–2లో గురువారం కొందరు ఉద్యోగులు గైర్హాజరయ్యారు. గైర్హాజరైన ఉద్యోగులపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ ప్రజలు వారి సమస్యలను విన్నవించుకోవడానికి సచివాలయానికి వచ్చి ఉద్యోగులు లేకపోవడంతో వెనుతిరుగుతున్నారు. విధులకు ఉద్యోగులు వీఆర్‌ఓ, వ్యవసాయ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లు మాత్రమే హాజరుకాగా, మిగిలిన ఐదుగురు ఉద్యోగులు గైర్హాజరయ్యారు. ఈ విషయమై ఎంపీడీఓ ఫణిరాజకుమారిని వివరణ కోరగా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉద్యోగులపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.

నిర్లక్ష్యం వీడేనా.. సిబ్బందిని నియమించేనా!

- అధికారులు లేక ఖాళీగా మద్దిరేవుల సచివాలయం
- సమస్యలు పరిష్కారం కాక ప్రజల అవస్థలు



మద్దిరేవుల సచివాలయం

లక్కిరెడ్డిపల్లి : ప్రజా సమస్యల పరిష్కారం, పల్లె గడపనే ప్రజలకు ప్రభుత్వ సేవలు, పేదలు, అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. మాజీ సీఎం సంకల్పానికి తగ్గట్టు ఈ వ్యవస్థ పని చేసింది. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించినట్టు ఉంది. లక్కిరెడ్డిపల్లి మండలంలోని మద్దిరేవుల గ్రామ సచివాలయంలో సిబ్బంది లేక సమస్యలు పరిష్కారం రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు చెబుదామని కార్యాలయానికి వెళ్లినవారికి కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఏమీ చేయలేక నిరాశగా ఇంటిబాట పడుతున్నారు. కాగా మద్దిరేవుల సచివాలయంలో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్‌తోపాటు ఐదు మంది సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీఆర్‌ఓ, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు బదిలీపై వెళ్లగా వీరిస్థానంలో మరొకరిని భర్తీ చేయాల్సి ఉండగా జిల్లా అధికారులు మరిచారు. అంతకుముందే గ్రామ సర్వేయర్ విధుల నుండి సస్పెండ్ కావడంతో సిబ్బంది కొరత తీవ్రతరమైంది. ప్రస్తుతం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసు, వెటర్నరీ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారు. దీంతో పని భారం మొత్తం వీరిపై పడింది. ఉన్న గ్రామ సిబ్బంది రెగ్యులర్ విధులు చేసుకుంటూ అదనపు బాధ్యతలు చేయడంతో ఎప్పుడు ఎవరు సచివాలయంలో అందుబాటులో ఉంటారో, ఎవరు ఏ విధులు నిర్వహిస్తున్నారో అంటూ ప్రజలు సతమతమవుతున్నారు. ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేస్తే గ్రామ అభివృద్ధి దోహద పడుతుందని ప్రజలు భావిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ పథకాలు, పింఛన్లు పంపిణీ ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు సిబ్బంది కొరతతో చేయాలంటే కృష్ణ తరమవుతుందని సిబ్బంది విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మండలస్థాయి, జిల్లాస్థాయి అధికారిక వర్గం దీనిపై తగు చర్యలు తీసుకొని ఖాళీ ఏర్పడిన స్థానంలో సచివాలయ సిబ్బందిని నియమిస్తే ప్రజలకు మేలు చేసినవారవుతారని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాలపైకి మద్దిరేవుల గ్రామంలో భూములు ఆన్‌లైన్‌లో లేక రైతులు సాగు చేసుకుంటున్న భూములకు 1బి అడంగల్ రావడం లేదని ఒకరి భూములు ఒకరిపేరు పైన గతంలో ఉన్నతాధికారులు రీసర్వేలో తప్పులు చేసిన నేపథ్యంలో సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శలున్నాయి. రైతులు సాగుచేసిన పంటలకు బ్యాంకులలో లోన్ తీసుకోవాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవచూపి మద్దిరేవుల గ్రామ సచివాలయానికి సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి

సమస్యలు పరిష్కారం కావాలన్నా.. గ్రామం అభివృద్ధి చెందాలన్నా తగినంత సిబ్బంది అవసరం. ప్రజల అవసరాల నిమిత్తం జిల్లా అధికారులు స్పందించి వెంటనే మా గ్రామానికి సిబ్బందిని నియమించాలి. ప్రభుత్వ అధికారుల దృష్టికి ఈ సమస్యను గతంలోనే నేను తీసుకెళ్లాను. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బందికి కేటాయించాలి.

– తుమ్మల చంద్రమ్మ, సర్పంచ్, మద్దిరేవుల, లక్కిరెడ్డిపల్లి మండలం